# 8

# స్వాతంత్ర్యం

**చాటింపు పక్ష పత్రికలో**
**'బాతాల పోశెట్టి' పేరిట రాసిన కాలమ్స్**

"మనకు స్వాతంత్ర్యం ఎలా వచ్చింది?

"ఆంగ్లేయులతో పోరాడితే వచ్చింది".

"ఎలా పోరాడారు?"

"అహింస అనే ఆయుధంతో"

"అహింస అనే ఆయుధంతో గాంధీజీగారి నాయకత్వంలో సత్యాగ్రహాలు, సమ్మెలు, సహాయ నిరాకరణోద్యమాల ద్వారా పోరాడి సాధించారు".

"ఇపుడు మనదే ప్రభుత్వం"

"ప్రజా ప్రభుత్వం"

"సరే! అది విడిచిపెట్టండి. మీలో ఒకరివద్ద ఆట వస్తువున్నది. అది మీ కన్నా బలవంతుడు వచ్చి గుంజుకున్నాడు. ఏంజేస్తారు?"

"ఒక్కడి చేతగాకపోతే అందరం కల్సిపోయి వాడి దగ్గర్నుంచి గుంజుకుంటాం. ఎక్కువ మాట్లాడ్తే నాల్గుతంతాం"

"మీకు ఆటవస్తువు ముట్టినట్టు గుంజుకున్నవాడికి రాసిస్తారా?"

"మేం వానికి రాసిచ్చుడేంది? ఇంక మాకు వానితో మంచి మాటేంది? అసలు మా వస్తువుకు మేం ముట్టినట్టు రాసిచ్చుడేంది?"

"మరయితే మన స్వాతంత్ర్యం అలా సంతకాలు పెట్టి రాసిచ్చింది."

"అబద్ధం"

"ఇంక మీరు చరిత్ర తెలిసినవారిని అడిగి తెలుసుకోండి"

"ఛీ! నిజంగ అట్లుంటదా?"

"సరే ఆ విషయం పక్కనపెట్టండి. మీ పక్కవాడు, వానికంటే బలం తక్కువవాడు మరియు మీ కంటే బలం ఉన్నోడు వచ్చి మీ తరఫున "ఏయ్! ఆటవస్తువు ఇలా యియ్యి. లేకపోతే అందరం కలిసి గుంజుకుంటాం అన్నాడనుకో, అప్పుడు "అయ్యా! కొద్దిసేపు ఆడుకొని యిస్తా' అంటే నాకే ఇయ్యాలి సుమా" అన్నాడు.

"అపుడు నిన్ను సముదాయించి ఎట్లన్నాజేసి నీకు రేపటి వరకు యిప్పిస్తా.. అని నమ్మపబలికి ఆ రాత్రికి ఆ ఆటవస్తువు గుంజుకున్నవాన్ని కల్సి అడిగి తీసుకున్నాడు. అపుడు మరి ఆటవస్తువు ముట్టినట్టు రాసియ్యి అంటే – తనది కానిది తన చేతిలో పడుతున్నది కదా అని అనుకుని (సంతోషపడి) రాసిచ్చాడు. ఇపుడు ఆటవస్తువు ముట్టిందని ఎవరు రాసిస్తారో అర్థమయిందా?"

"అయ్యింది"

"ఎవరు రాసిస్తారు"

"మాక్కాకుండా – వానిక్కాకుండా జేసిన నడిమివాడు. పక్కవాడు"

"అయితే ఆటవస్తువు మీకు ముట్టినట్టేనా?"

"మాకెక్కడ ముట్టింది'

"ఏమయినట్టు"

"నడిమివాడు తీసుకున్నాడు"

"అయితే అది ఆటవస్తువుకు బదులు స్వాతంత్ర్యం అయితే మీకు స్వాతంత్ర్యం వచ్చినట్టేనా?"

"రానట్టే'

"మరయితే మీది మీకు రావాలంటే ఏంజెయ్యాలి'"

"ఇపుడు నడిమివాడితో పోట్లాడాలి"

"ఆc! సరే ఆ సంగతి అటుబెట్టండి. ప్రభుత్వం శాసనాలు ఎందుకు తయారుచేస్తున్నామని అంటుంది?"

"ప్రజల శ్రేయస్సు కోసం"

"వాటిని ధిక్కరిస్తే ఏమవుతుంది?"

"జైలుకు పంపి శిక్షిస్తారు"

"శిక్షంటే జ్ఞాపకం వచ్చింది. ఒక మనిషిని హత్య చేస్తే ఎంత శిక్ష?"

"యావజ్జీవ కారాగార శిక్ష"

"యావజ్జీవ కారాగారశిక్షంటే ఎంత?"

"పధ్నాలుగు సంవత్సరాలు"

"ఇద్దర్ని చంపితే ఎంత శిక్ష?"

"ఏమో!"

"అది పోనీ! మరి ప్రభుత్వ శాసనాలను ధిక్కరించినవాళ్లు, మనుషులను చంపినవాళ్లు ఎంత పెద్దవాళ్లయినా ఏం చేయాలి?"

"శిక్షించాలి"

"ఎవరు శిక్షించాలి?"

"ప్రభుత్వం – న్యాయస్థానాలు"

"న్యాయస్థానాలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రభుత్వమే అట్లా చేస్తే ఏం చేయాలి?"

"నాకు తెల్వదు. ఏం చేయాలె?"

**జగిత్యాలనుండి బి. బాలగంగాధర్ సంపాదకత్వంలో**
**వెలువడిన 'చాటింపు' పక్ష పత్రిక 1983**